## ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ



తన నామినేషన్‌ను ఉపసంహరణ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న జయరాజ్ యాదవ్, చిత్రంలో ఓం ప్రకాశ్ భీష్వ

అబిడ్స్, నవంబర్ 15 : గోషామహల్ నియోజకవర్గం నుంచి 24 మంది అభ్యర్థులు ఉండగా బుధవారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ కావడంతో ముగ్గురు ఉపసంహరించుకున్నారు. స్వతంత్ర అభ్యర్థి జయరాజ్ యాదవ్, నాయకులు ఓం ప్రకాశ్ భీష్వతో కలిసి తన నామినేషన్ ఉపసంహరణ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఆయనతో పాటు మరో ఇద్దరు తమ నామినేషన్ల ఉపసంహరించుకున్నారు. దాంతో బరిలో 21 మంది అభ్యర్థులు ఉన్నారని రిటర్నింగ్ అధికారి వి.విక్టర్ తెలిపారు. బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారి విక్టర్ గుర్తులను కేటాయించారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్ నుంచి నందకిశోర్ వ్యాస్, బీజేపీ నుంచి టి.రాజాసింగ్, కాంగ్రెస్ నుంచి మొగిలి సునీత, ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్రులు రంగంలో ఉన్నారు.

## నాంపల్లి బరిలో 34 మంది అభ్యర్థులు




నాంపల్లి రిటర్నింగ్ కార్యాలయంలో గుర్తులు కేటాయిస్తున్న అధికారులు

మెహిదీపట్నం, నవంబర్ 15 : నాంపల్లి అసెంబ్లీ బరిలో 34 మంది అభ్యర్థులు నిలిచారు. మొత్తం 45 మంది నామినేషన్లు దాఖలు చేయగా 11 మందివి వివిధ కారణాలతో అధికారులు రద్దు చేశారు. బుధవారం ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి లావణ్య ఆధ్వర్యంలో ముందుగా నామినేషన్ల విత్‌డ్రాల కోసం అధికారులు మధ్యాహ్నం 3 గంటల వరకు ఎదురు చూశారు. 34 మందిలో ఎవరూ తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకోలేదని, వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులకు వారివారి గుర్తులను కేటాయించామని, స్వతంత్ర అభ్యర్థులకు వేర్వేరు గుర్తులను ఇచ్చామని ఆర్ఓ తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్ (కారు గుర్తు), ఎంఐఎం అభ్యర్థి మహ్మద్ మాజిద్ హుస్సేన్(గాలిపటం), కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ (చేతి గుర్తు), బీజేపీ అభ్యర్థి రాహుల్ చంద్ర (కమలం గుర్తు)లతో బరిలో ఉంటారని ఆర్ఓ తెలిపారు. మిగితా అభ్యర్థులకు వేర్వేరు గుర్తులను కేటాయించామని ఆమె చెప్పారు.

## కార్వాన్ బరిలో 18 మంది

కార్వాన్, నవంబర్15 : నామినేషన్ల ఉపసంహరణకు 15వ తేదీ చివరి తేదీగా ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. కార్వాన్ రిటర్నింగ్ డి. కొమరయ్య, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి. అహల్య మాట్లాడుతూ.. కార్వాన్ నుంచి మొత్తం 24 మంది నామినేష్లు వేయగా ముగ్గురు స్వతంత్రులు స్క్రూటీనీలో తొలగింపబడ్డారు. మిగిలిన 21 మందిలో మరో ముగ్గురు స్వతంత్రులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మొత్తం 18 మంది అభ్యర్థులు నిలిచినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు..మిత్ర కృష్ణ – బీఆర్‌ఎస్, కౌసర్ మొయినుద్దీన్– ఏఐఎంఐఎం, ఉస్మాన్ బిన్ మహమ్మద్ అల్ హజ్రీ– కాంగ్రెస్, టి. అమర్ సింగ్– భారతీయ జనతా పార్టీ, బి. నర్సింగ్ రావు– ప్రజా ఏక్తా పార్టీ, ఏ. కార్తీక్– యుగతులసి పార్టీ, జె.ఎం. గురుచరణ్– బహుజన రాష్ట్ర సమితి, మోతే రమేశ్– ధర్మ సమాజ్ పార్టీ, ఆవుల శ్రీకాంత్– ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, మిగతా వారు స్వతంత్రులు.



గోషామహల్ బీజేపీ అభ్యర్థి టి. రాజాసింగ్ రాంకోఠిలో జయరాజ్ యాదవ్‌ను కలిసి మద్దతు కోరారు. రాజాసింగ్ మాట్లాడుతూ.. కోట్లాది రూపాయల తో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. జయరాజ్ యాదవ్ మాట్లాడుతూ.. ధర్మం కోసం రాజాసింగ్‌కు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు ఓం ప్రకాశ్ భీష్వ పాల్గొన్నారు. **- అబిడ్స్, నవంబర్ 15**

# బీఆర్‌ఎస్ విజయం ఖాయం

అబిడ్స్, నవంబర్ 15 : గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌కు మద్దతుగా అల్లబండ, మంగళ్‌హాట్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. వహీద్ అహ్మద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అమలు చేసిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్శితులై గెలిపించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతోందన్నారు. సీఎం కేసీఆర్ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతున్నారని కొనియాడారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలతో ప్రజలు లబ్ధి పొందుతున్నారని.. ప్రజల సహకారంతో నందకిశోర్ వ్యాస్ ఘన విజయం సాధిస్తారని తెలిపారు. వ్యాస్‌ను గెలిపిస్తే ఆయన నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్





నాంపల్లి లో ఈ సారి బీఆర్‌ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని బీఆర్‌ఎస్ అభ్యర్థి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్ దీమా వ్యక్తం చేశారు. బుధవారం విజయనగర్‌కాలనీ డివిజన్ పరిధి లోని హుమాయున్ నగర్, వెంకటాద్రి నగర్, ఎన్ఎండీసీ, దేవుని కుంట వేంకటేశ్వర్‌స్వామి ఆలయం పరిసరాల్లో పాదయాత్రలో భాగంగా డోర్ టు డోర్ క్యాంపేయినింగ్ నిర్వహించారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు సి.సంజయ్, గోప అభిషేక్‌రాజ్, ఇస్మాయిల్,ఉస్మాన్, ఉమర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **- సుల్తాన్‌బజార్, నవంబర్ 15**



కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ **- కార్వాన్, నవంబర్15**



## పేరిణి నృత్యాన్ని కాపాడుకోవాలి



పేరిణి నృత్యాన్ని కాపాడుకోవాలని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో పేరిణి నాట్య గురు శిష్య పరం పర –2023 బుధవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మామిడి హరికృష్ణ విచ్చేశారు. కూచిపూడి, భరతనాట్యం, పేరిణి ప్రాచీన కళాకృత్యాలని, నటరాజరామకృష్ణ ఈ కళలను భవిష్యత్ తరాలకు అందించిన మహనీయుడని కొనియాడారు. పేరిణి నృత్య కార్యక్రమాన్ని గజ్జెల రంజిత్‌కుమార్ రవీంద్రభారతిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాట్యగురువు కళాకృష్ణ, డా. శివాజి వద్రేవ్, ఆచార్య సుందరంపల్లి శ్రీదేవి, గజ్జెల రంజిత్ నవ్యజ, డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, అరవింద్‌ఆర్య, కుమార్, ప్రకాశ్ సునీలా పాల్గొన్నారు. **- రవీంద్రభారతి, నవంబర్15**

## ఆసక్తి ఉంటే చదువుకోవడానికి అవకాశాలు



ఆర్థికంగా లేకున్నా ఆసక్తి ఉంటే అమెరికా, వివిధ దేశాల్లో పేద విద్యార్థులు సైతం చదువుకోవడానికి అవకాశాలు ఉన్నాయని గ్లోబల్ ఎన్నారై కో – ఆర్డినేటర్ రాయదాసు మంథని అన్నారు. నిజాం కళాశాలలో బుధవారం ఈక్వల్ అపార్చునిటీ సెల్ ఆధ్వర్యంలో గ్లోబల్ చాలెంజెస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఎంటర్‌ప్రూనర్ షిప్, స్టడీ అండ్ జాబ్స్ ఇన్ అబ్రాడ్ పై ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాయదాసు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను పేద విద్యార్థులకు అందజేయడం అభినందనీయం అన్నారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్ విన్నపం మేరకు కళాశాలకు 25 కంప్యూటర్లను విరాళంగా అందించేందుకు అంగీకరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, ఈక్వల్ అపార్చునిటీ సెల కో – ఆర్డినేటర్ డాక్టర్ దీకొండ తిరుపతి పాల్గొన్నారు.

**- సుల్తాన్‌బజార్,నవంబర్ 15**

## వినోబా భావే సేవలు చిరస్మరణీయం



భూదాన ఉద్యమ నాయకులు ఆచార్య వినోబా భావే గొప్ప జ్ఞాని. గోవుల పరిరక్షణ కర్త, దార్శనికులు, సామాజిక ఉద్యమకారుడిగా అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్నా రాజేందర్‌రెడ్డి కొనియాడారు. బుధవారం నాంపల్లిలోని రాష్ట్ర గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ కార్యాలయంలో ఆచార్య వినోబా భావే వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాంధేయవాద సంస్థల ప్రతినిధులు ఆచార్య సుబ్రమణ్యం వడ్ల, యానాల ప్రభాకర్‌రెడ్డి, కె. సుభాష్ చంద్ర, వై. శంకర్‌రెడ్డి, కనకదుర్గ, స్వరూప, రాజాసింగ్, ప్రభు పాల్గొన్నారు. **- అబిడ్స్, నవంబర్ 15**



గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని మంగళ్‌హాట్ ప్రాంతంలో కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీత ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని చేపట్టారు. ప్రజల నుంచి తనకు మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రచారాన్ని చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. **- అబిడ్స్, నవంబర్ 15**